

అద్దె ప్రాతిపదికన పోలీసు షాపులు

శ్రీకాకుళం: జిల్లాలో మూడు పోలీసు షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో ఆరు షాపులను అద్దె ప్రాతిపదికన నిర్వహణకు ఈనెల 30వ తేదీన బహిరంగ వేలం ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం ముందు భాగాన ఉన్న ఒక షాపు, రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ వెనుక భాగాన ఉన్న పాత షాపింగ్ మాల్‌లో నాలుగు షాపులు, శ్రీకాకుళం సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయం వద్ద ఒక షాపును అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు జిల్లా పోలీసు కార్యాలయంలో 30వ తేదీన బహిరంగ వేలం ప్రక్రియకు హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వెల్ఫేర్ ఆర్ఐ ఉమామహేశ్వరరావు ఫోన్ నంబరు 6309990841 గానీ itcoresrikakulam@gmail.com మెయిల్‌ద్వారా గానీ సంప్రదించవచ్చని తెలిపారు.

రాష్ట్రాన్ని నాశనం చేశారు

- అప్పుల్లో మొదటి స్థానం... ఆదాయంలో ఆఖరి స్థానం
- ఉత్తరాంధ్రపై జగన్‌ది కపట ప్రేమ
- వైసిపి ప్రభుత్వం పోతేనే అభివృద్ధి
- ఖాదీ కార్మికులకు అండగా ఉంటా
- టిడిపి అధినేత చంద్రబాబునాయుడు
- రోడ్ షోలో బాబుకు ఘన స్వాగతం



రోడ్ షోలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - పొందూరు, రణస్థలం, ఎచ్చెర్ల

ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేశారని మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. విజయనగరం జిల్లా రాజాంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం వచ్చిన ఆయనకు రణస్థలం, ఎచ్చెర్ల, పొందూరులో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా పొందూరు మండల కేంద్రంలో అంబేద్కర్ కూడలిలో ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. వైసిపి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విధ్వంసాలు ఆగాలన్నా, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలన్నా సైకో వైసిపి ప్రభుత్వం పోవాలన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతిఒక్కరి పైనా ఉందన్నారు. ఏం సాధించారని ప్రభుత్వ డబ్బులతో సిఎం పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. చెత్తపై పన్ను వేసిన చెత్త సిఎం జగన్ అని విమర్శించారు.

అప్పల్లో ఫస్ట్... ఆదాయంలో లాస్ట్

రాష్ట్రం అప్పులో మొదటి స్థానంలో ఉందని, ఆదాయంలో మాత్రం ఆఖరి స్థానంలో ఉందన్నారు. మహిళలపై దాడుల్లో మొదటి స్థానంలో ఉందన్నారు. బీహార్, ఒడిశా కంటే మన రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని తెలిపారు. రాష్ట్రం నుంచి కంపెనీలన్నీ పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్ ఉత్తరాంధ్రపై కపట ప్రేమ చూపుతున్నారని ఆరోపించారు. ఈ మూడున్నరేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేశారా?, ఒక్క పరిశ్రమనైనా నెలకొల్పారా?, ఒక్క కళాశాలనైనా ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. జాబు రావాలన్నా, రైతు బాగుపడాలన్నా బాబు రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. అధికారం శాశ్వతం కాదని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సైకో ప్రభుత్వం ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు.

ఖాదీ కార్మికులకు అండగా ఉంటా

టిడిపి నాయకులు కింజరాపు అచ్చెన్నాయుడు, కూన రవికుమార్, ఇతరులపై అక్రమ కేసులు పెట్టి ఏం సాధించారని ప్రశ్నించారు. నిబంధనలకు తిలోదకాలిస్తున్న తమ్మినేని సీతారాంకు స్పీకర్‌గా కొనసాగే అర్హత లేదన్నారు. పొందూరుకు దేశంలో ఎంతో పేరు ఉందని ఇక్కడి ఖాదీ, చేనేత కార్మికులకు అండగా ఉంటానని, సాయం చేస్తానని హామీనిచ్చారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు, జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ తదితరులున్నారు.



పొందూరులో గజమాలతో చంద్రబాబుకు స్వాగతం

చంద్రబాబుకు ఘన స్వాగతం

విజయనగరం జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబు నాతవలస నుంచి రాజాం వరకు రోడ్ షో నిర్వహించారు. రణస్థలం మండలం రామతీర్థం కూడలి వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు, గజమాల, పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఎచ్చెర్ల, చిలకపాలెం, లోలుగు, రాపాక, పొగిరి, పొందూరు మీదుగా చంద్రబాబు రోడ్ షో సాగింది. పొందూరులో దారి పొడవునా పూలు చల్లుతూ, హారతులిస్తూ ప్రజలు నీరాజనాలు పలికారు. లోలుగు, పొందూరులో భారీ గజమాలతో సత్కరించారు. బాణాసంచా పేలుళ్లు, డప్పుల దరువులు, తప్పెటగుళ్లు, పార్టీ జెండాలతో స్వాగతం లభించింది. రోడ్‌షోకు తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలకు చంద్రబాబు చేతులు జోడించి అభివాదం తెలిపారు. తెలుగు తమ్ముళ్ల హడావుడితో రోడ్ షో మొత్తం పండగ వాతావరణం నెలకొంది. రహదారి పొడవునా జనం బారులు తీరారు. స్వాగతం పలికిన వారిలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకట్రావు, కావలి ప్రతిభాభారతి, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యేలు కలమట వెంకటరమణ, గుండ లక్ష్మీదేవి, జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, కలిశెట్టి అప్పలనాయుడు, గుండ శంకర్, చిగిలిపల్లి రామ్మోహనరావు, పలువురు నాయకులు ఉన్నారు.

చంద్రబాబు దృష్టికి టోల్‌ప్లాజా కార్మికుల సమస్యలు

ఎచ్చెర్ల : చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులకు వెంటనే న్యాయం జరిగేలా కషి చేయాలని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కార్మికులు వినతిపత్రం అందించారు. గురువారం చిలకపాలెం టోల్ గేటు వద్ద టోల్ ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన కార్మికులు చేపట్టిన దీక్షా శిబిరం వద్ద చంద్రబాబు తన వాహనాన్ని ఆపి, కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ చిలకపాలెం టోల్ ప్లాజాను ఎత్తివేసి నాతవలస, మడపాం టోల్ ప్లాజాల్లో టోల్ రుసుంను పెంచి ఆదాయం తగ్గకుండా సర్దుబాటు చేశారని తెలిపారు. కానీ రోడ్డున పడ్డ 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న 106 మంది కార్మికులను టోల్ ప్లాజాల్లో సర్దుబాటు చేయాలని, లేనిపక్షంలో గ్రాట్యూటీ, నష్ట పరిహారం చెల్లించి ప్రభుత్వం, హైవే అధికారులు ఆదుకునేలా కృషి చేయాలని చంద్రబాబును కోరారు. దీనిపై నేషనల్ హైవే పీడీని రెండు సార్లు కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో చిలకపాలెం టోల్ ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.వి.నర్సింహులు, ఎ.వి.ఆర్.మూర్తి, శంకరనారాయణ ఉన్నారు.



చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న టోల్‌ప్లాజా కార్మికులు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి తదితరులు

త్వరితగతిన డ్రోన్ ఫ్లై

సిసిఎల్ఎ జి.సాయిప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో చేపడుతున్న రీ సర్వేలో డ్రోన్ ఫ్లైను త్వరితగతిన పూర్తి చేయాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం విఆర్‌ఒల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. రీ సర్వేపై జిల్లా గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ డ్రోన్ ఫ్లై ఉదయం ఏడు గంటలకు ప్రారంభం కావాలని తద్వారా లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయగలుగుతారని చెప్పారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ ప్రతిరోజూ డ్రోన్ ఫ్లై జరుగుతోందన్నారు. 27 వేల ఎకరాలు లక్ష్యం నిర్ధేశించగా, 28 వేల ఎకరాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే 40 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లోనూ త్వరితగతిన పూర్తి చేస్తామని హామీనిచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

26 లోగా తిరస్కార ఓటర్ల ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రత్యేక ఓటర్ల నమోదులో తిరస్కార ఓటర్ల ప్రక్రియను ఈనెల 26వ తేదీ లోగా పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ డిప్యూటీ సిఇఒ వెంకటేశ్వర్లు అన్నారు. ఓటర్ల నమోదు, తిరస్కరణ, పట్టభద్రుల ఎన్నికల ఓటర్ల నమోదు, ఎపిక్ కార్డుల పంపిణీ తదితర అంశాలపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రత్యేక ఓటర్ల నమోదులో ఈనెల ఎనిమిదో తేదీ వరకు నమోదైన వాటిలో తిరస్కార ఓటర్లను ఈనెల 26లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అటువంటివి జిల్లాలో 3,938 ఉన్నాయని, ఈనెల 25 లోగా పూర్తి కావాలన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు సంబంధించి ఈనెల 25 చివరి తేదీ అని స్పష్టం చేశారు. ఈనెల తొమ్మిదో తేదీ వరకు వచ్చిన వాటిని ఇఆర్‌ఒలకు పంపాలని తెలిపారు. అందులో 8,462 ఓటర్లకు గానూ 1,322 ఇఆర్‌ఒలకు పంపించాల్సి ఉన్నాయన్నారు. వాటిని ఇఆర్‌ఒ ఈనెల 25లోగా పరిశీలించి, 26వ తేదీ నాటికి నమోదు, తిరస్కరణలు పూర్తి చేస్తారని చెప్పారు. ఎపిక్ కార్డుల పంపిణీపై సమీక్షించగా, జిల్లాలో పూర్తిగా పంపిణీ చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఆర్‌ఒ రాజేశ్వరి

ఇచ్ఛాపురంలో డయాలసిస్ యూనిట్

- తక్షణమే పనులు ప్రారంభించాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇచ్ఛాపురం ప్రాంతంలో డయాలసిస్ యూనిట్లు అత్యవసరమని, తక్షణమే పనులు ప్రారంభించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సంబంధిత ఏజెన్సీలను ఆదేశించారు. ఉద్దానం ప్రాంతంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ యూనిట్స్, అదనపు బెడ్ల ఏర్పాటుపై సంబంధిత ఏజెన్సీలు, వైద్యాధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ యూనిట్లు ఇచ్ఛాపురంలో అత్యవసరమైనందున, అక్కడ తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రానున్న 30 రోజుల్లోగా ఇచ్ఛాపురంలో డయాలసిస్ కేంద్రంతో పాటు పది బెడ్లనూ ఏర్పాటు చేయాలని నెఫ్రో ప్లస్ ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. సోంపేట, కవిటి ప్రాంతాల్లోనూ కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం అదనపు బెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పనులన్నీ జనవరి 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి సోమవారం ఆయా ప్రాంతాలను సందర్శించి పనులు ప్రారంభించాలన్నారు. అక్కుపల్లి, బెలగాం, కంచిలి, గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు పలాస, హరిపురం, బారువ, సోంపేట, ఇచ్ఛాపురం సామాజిక ఆరోగ్య కేంద్రాలకు చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపితే నిధులను మంజూరు చేస్తామన్నారు. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు చెందిన బిల్లులను తమకు సమర్పిస్తే తక్షణమే నిధులను విడుదల చేస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎస్.అనురాధ, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి జె.భాస్కరరావు, నెఫ్రాలజిస్టు కె.విద్యాసాగర్, నెఫ్రో ప్లస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి రాజగోపాల్, క్లస్టర్ మేనేజర్ సురేష్, ఎపిఎంఎస్‌ఐడిసి కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రసాద్, సిహెచ్‌సి, పిహెచ్‌సిల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యుల పనితీరుపై ప్రశ్నిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

వైద్యం చేస్తున్నారా... బిజినెస్ చేస్తున్నారా..?

- పొందూరులో ప్రభుత్వాస్పత్రి ఉందని ప్రజలకు తెలుసా..!
- వైద్యులపై శాసనసభ స్పీకర్ తమ్మినేని ఆగ్రహం

ప్రజాశక్తి - పొందూరు

'వైద్యం కోసం ఇక్కడికి వచ్చే రోగులను శ్రీకాకుళం రిఫర్ చేయడమేమిటి, మీరు వైద్యం చేస్తున్నారా..? బిజినెస్ చేస్తున్నారా?' అని పొందూరు సామాజిక ఆస్పత్రి వైద్యులపై శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. పొందూరు సామాజిక ఆస్పత్రి పరిధిలోని కింతలి, తాడివలస పిహెచ్‌సి వైద్యులు, వైద్య సిబ్బంది, అభివృద్ధి కమిటీతో స్థానిక సిహెచ్‌సిలో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొందూరులో సామాజిక ఆస్పత్రి ఒకటి ఉందని అసలు ప్రజలకు తెలుసా అని వైద్యులను ప్రశ్నించారు. వైద్యులు ఉదయం 11 గంటలకు వచ్చి, మధ్యాహ్నం భోజనం చేసి వెళ్లిపోతున్నారని ప్రజల నుంచి తనకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆస్పత్రికి ఎన్ని ఆరోగ్యశ్రీ కేసులు వచ్చాయని వైద్యులను ప్రశ్నించగా, వారు సరైన సమాధానం చెప్పకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న ప్రయివేటు ఆస్పత్రికి వెళ్తున్నారు గానీ ఇక్కడకు రాకపోవడానికి వైద్యులు అందుబాటులో లేకపోవడమే కారణమన్నారు. రాత్రి సమయంలో వచ్చే రోగులకు సరైన వైద్యం అందడం లేదని, తాను ఆకస్మిక తనిఖీ చేస్తానని చెప్పారు. వైద్య సిబ్బంది పనితీరుపై ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఆస్పత్రిలో మందుల గురించి స్పీకర్ ప్రశ్నించగా 373 రకాల మందులు ఉండాల్సి ఉండగా, 20 రకాల మందులు లేవని వైద్యులు తెలిపారు. హెచ్‌డిఎస్ నిధులతో అవసరమైన మందులను కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఇకపై రెండు నెలలకోసారి సమీక్షిస్తానన్నారు. సమావేశం అజెండా కాపీలను సభ్యులకు ఇవ్వకపోవడంతో సమావేశ నిర్వహణ ఇలాగేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కింతలి, తాడివలస పిహెచ్‌సిల పనితీరు, అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాడివలస పిహెచ్‌సికి వెళ్లే రహదారికి పంచాయతీ అనుమతి ఇవ్వకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. అభివృద్ధిని అడ్డుకుంటే చర్యలు తప్పవని దీనిపై కలెక్టర్, డిపిఒతో మాట్లాడతానన్నారు. అనంతరం ఆస్పత్రిలో వైద్య పరికరాలతో పాటు నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. సమావేశంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, సర్పంచ్ రేగిడి లక్ష్మి, సిహెచ్‌సి అభివృద్ధి కమిటీ కన్వీనర్ గిరి, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, తహశీల్దార్ రాంబాబు, డిసిహెచ్ ఎస్.భాస్కరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ రామదాసు, వైద్యాధికారులు మల్లీశ్వరమ్మ, సాగరిక, రమేష్‌నాయుడు, ఉదయ్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ మాత్రలు వికటించి విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి - పోలాకి

ఐరన్ మాత్రలు వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన మండలంలోని అంపలాం పంచాయతీ నందిగాం ప్రాథమిక పాఠశాలలో గురువారం చోటు చేసుకుంది. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రతి గురువారం మధ్యాహ్న భోజనం తర్వాత ఐరన్ మాత్రలు వేస్తుంటారు. అందులో భాగంగా పాఠశాలలో 27 మందికి భోజనం తరువాత మాత్రలు ఇచ్చారు. మాత్రలు వేసుకున్న పది మంది విద్యార్థులు కళ్లు తిరిగి పడిపోయారు. హెచ్‌ఎం కిల్లి సింహాచలం అప్రమత్తమై ఆటోలో విద్యార్థులను పోలాకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వైద్యులు విద్యార్థులకు తనిఖీ చేసి, మందులు ఇచ్చారు. ముగ్గురు విద్యార్థులకు సెలైన్ ఎక్కించారు. ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నీరసంగా ఉండటం వల్ల కళ్లు తిరిగి పడిపోయారని చెప్పారు. వారి ఆరోగ్యం బాగానే ఉందని చెప్పారు. మధ్యాహ్నం 2.30 గంట లకు వారిని తిరిగి పంపించేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

జిల్లాకు రాష్ట్ర స్థాయి తనిఖీ బృందాలు

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఉపాధి హామీ పథకం నిర్వహణపై రాష్ట్ర స్థాయి ప్రత్యేక తనిఖీ బృందాలు రానున్నాయని, మండలాల్లో పనులు జరిగిన తీరు, రికార్డుల నిర్వహణ, తదితర వివరాలను పరిశీలించనున్న నేపథ్యంలో సిబ్బంది పూర్తిస్థాయి సమాచారంతో సిద్ధంగా ఉండాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ జీవి.చిట్టిరాజు సిబ్బందిని ఆదేశించారు. పరిశీలన సమయంలో వైఫల్యాలు కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం జిల్లాలోని 30 మండలాల సిబ్బందితో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో కూలీల మొబలైజేషన్‌పై ప్రత్యేక దృష్టిని సారించడంతో పాటు సగటు వేతనం రూ.250 వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భూగర్భ జలమట్టాన్ని పెంపొందించే పనులతో పాటు ఇతర పనులు చేపట్టేందుకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. వ్యక్తిగత పండ్ల తోటల పెంపకం పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, శతశాతం మొక్కలు క్షేత్రస్థాయిలో ఉండేలా చూడాలన్నారు. మండలాల నుండి ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన విజయ గాథలను పంపించాలని పదే పదే చెబుతున్నప్పటికీ కనీస స్థాయి స్పందన రావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమృత్ సరోవర్ పనులు త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హౌసింగ్ 90 రోజుల పని దినాలకు సంబంధించి మండలాల్లో ఆశించిన ప్రగతి కనిపించడం లేదని, చెల్లింపులు వేగవంతం చేయాలన్నారు. సకాలంలో కూలి చెల్లింపులకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీల్లో నిధులు ఉన్నాయా, ఉపాధి హామీ పథకం పనుల వద్ద నేమ్ బోర్డులు ఏర్పాటు పనులు త్వరగా చేపట్టాలన్నారు. సామాజిక తనిఖీ రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఫైనాన్స్ మేనేజర్ స్వరూపారాణి, ఎపిడి జి.హరిత, ప్లాంటేషన్ మేనేజర్ శ్యామల, సూపర్‌వైజర్ జి.రామచంద్రరావు, హెచ్‌ఆర్ మేనేజర్ విజయ వాణి, డిఆర్ పి.మన్మథరావు, ఎపిఒలు, ఇసిలు, టిసిలు, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జి.వి చిట్టిరాజు

పోటీతత్వంతోనే ఉన్నత శిఖరాలు

జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యార్థుల్లో పోటీతత్వం ఉన్నప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ అన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు గరిమెళ్ల సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించిన విద్యా సాంస్కృతిక పోటీల్లో విజేతలైన విద్యార్థులకు గురువారం మెమెంటోలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. గరిమెళ్ల వర్ధంతితో పాటు గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోలాకి మండలం ప్రియాగ్రహారానికి చెందిన గరిమెళ్ల ట్రస్టు నిర్వాహకులు గణపతిరావు గరిమెళ్ల జీవిత విశేషాలు, స్వాతంత్ర్యోద్యమంలో నిర్వహించిన పాత్రను వివరించారు. శ్రీనివాస రామానుజన్ గురించి డి.వి సత్యనారాయణ వివరించారు. వేమన పద్యాలను చిత్రలేఖనంగా 106 మంది విద్యార్థులు వేశారు. అందులో ఎంపికైన చిత్రాలను స్కూల్ ఆవరణలో ప్రదర్శించారు. పాఠశాల పూర్వ విద్యార్థి వాడపల్లి హనుమంతురావు స్మారకార్థం ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్లో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పతకాలను అందజేశారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కోశాధికారి పి.సుధాకరరరావు అతిథులను ఆహ్వానించగా, కార్యదర్శి ఎం.ప్రభాకరరావు వందన సమర్పణ చేశారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దేవదత్తానంద్, విశ్రాంత బ్యాంకు అధికారి కె.ఎస్.ఎన్ మూర్తి, విశ్రాంత డిప్యూటీ డిఇఒ కొత్తకోట అప్పారావు, ఆర్.మధుసూధనరావు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న డిఇఒ పగడాలమ్మ

గణిత మేధావి రామానుజన్



శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మల్లేశ్వరరావు



లావేరు : ప్రాజెక్టును పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ డేనియల్



ఆమదాలవలస : చిన్నికృష్ణకు బహుమతిని అందజేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గణితశాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ 136వ జయంతి వేడుకలు నగరంలోని పిఎన్ కాలనీని న్యూ సెంట్రల్ స్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకులు పి.జగన్మోహనరావు, ప్రిన్సిపాల్ బలివాడ మల్లేశ్వరరావులు రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు పి.శ్రీకాంత్, పి.శ్రీదేవి, కో-ఆర్డినేటర్లు వైవిఎస్ఎన్ మూర్తి, డివిఎన్ పట్నాయక్, సరోజిని, వెంకటరావు, గణిత ఉపాధ్యాయులు జగపతి, ప్రసాద్, వనజకుమారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నగరంలోని మహాలక్ష్మీనగర్ కాలనీలో శ్రీచైతన్య పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్ అధ్యక్షతన గణిత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. గణిత క్విజ్‌లో ప్రతిభను కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన ప్రాజెక్టులు, చార్టులు, నమూనాలు, సమస్యలు, గణిత పజిల్స్ అందరినీ ఆకర్షించాయి. విద్యార్థులు చేసిన సాంఘిక లఘు నాటికలు, శాస్త్రీయ, సాంస్కృతిక, జానపద, నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్ ఎ.బాలరాజు, రీజియన్ ఇన్‌ఛార్జి ఎస్.రామినాయుడు, జోనల్ అకడమిక్ డీన్ పి.మోహన్‌బాబు, అకాడమిక్ డీన్ ఎ.హరిప్రసాద్ పాల్గొన్నారు.

అలాగే అరసవల్లి రోడ్డులోని 'శర్వాణి విద్యాలయ'లో డైరెక్టర్ అంధవరపు సూరిబాబు రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన ఆసక్తి కలిగించే వివిధ మేథ్స్ ప్రాజెక్టులను పరిశీలించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, ఉపాధ్యాయులు డి.రవి, కె.త్రినాథ్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శ్యామసుందర్, ప్రోగ్రాం ఆఫీసర్ జలుమూరు రవి, విశ్రాంత లెక్చరర్ నిష్టల నరసింహమూర్తి, సిహెచ్.దుర్గారావు, ఇందిర, బి.మోహనరావు పాల్గొన్నారు.

పట్టణంలోని భవిత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయ సిబ్బంది పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఇందులో ఇందులో మ్యాథ్స్ ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను విద్యార్థులు సందర్శించారు. అనంతరం గణిత ఉపాధ్యాయులు బి.చిన్నికృష్ణ, పి.వేణులను విద్యార్థులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సువ్వారి సునీత, కరస్పాండెంట్ సువ్వారి మురళీధర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవం వేడుకలో భాగంగా సిక్కులు చేయూత సేవా సంఘం' ఆధ్వర్యాన ఈ నెల 18న గణిత ప్రతిభా పరీక్షను నిర్వహించారు. అందులో విజేతలకు స్థానిక లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో వైద్యులు దానేటి శ్రీధర్ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వి.రమణమ్మ, సిక్కోలు చేయూత సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సీపాన హేమమోహన్, సిక్కులు చేయూత సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రణస్థలం : మండలంలోని కొండములగాం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో గణిత దినోత్సవ సందర్భంగా ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్, గణిత ఉపాధ్యాయులు ఎన్.సూర్యప్రకాష్, జి.బాలామణి, వి.శైలజ ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రాలేఖనం పోటీలు నిర్వహించారు. ఆరు నుంచి ఇంటర్ విద్యార్థులు తమ సృజనాత్మకతకు అద్దం పట్టే ఎన్నో రకరకాల ప్రాజెక్టులు పాఠశాల మైదానం ఆవరణలో ప్రదర్శనకు పెట్టారు. రంగవల్లికలో రామానుజన్ చిత్రం అతద్భుతంగా వేశారు. 9వ తరగతి విద్యార్థిని కె.ధరణి, పదో తరగతి విద్యార్థిని హైమావతి వేసి చిత్రాలు ఆకట్టుకున్నాయి. ముందుగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

లావేరు : గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాసన్ రామానుజన్ చిత్రపటానికి లావేరు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు. అలాగే మురపాక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సహాయకులు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

స్థానిక తామాడ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు గణితశాస్త్రానికి సంబంధించి వివిధ ప్రాజెక్టులను చేయించి ఎగ్జిబిషన్‌గా ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టులను ప్రిన్సిపాల్ జె.డేనియల్ పరిశీలించి ప్రశంసించారు. కార్యక్రమంలో గణితశాస్త్ర ఉపాధ్యాయులు విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత, నివగాం జిల్లా పరిషత్ పాఠశాలల్లో రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒ బి.శ్రీధర్, ప్రిన్సిపాల్ బందారు రవి కుమార్, సర్పంచ్ పి.కృష్ణవేణి, ప్రధానోపాధ్యాయులు ఎస్.నిర్మల, ఉపాధ్యాయులు చోడవరపు కాంతారావు, జె.తిరుపతిరావు, ఎల్.సింహాద్రినాయుడు, పి.రామరాజు, విశ్రాంత హెచ్ఎం గంగు కృష్ణారావు, విద్యాకమిటీ చైర్మన్ వి.శ్రీను పాల్గొన్నారు.

బూర్జ : బూర్జ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రామానుజన్ చిత్రపటానికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పి.చిరంజీవిరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం గణిత ఉపాధ్యాయులను రాగోలు దుశ్శాలువ కప్పి సన్మానించారు.

కవిటి: ప్రపంచానికే గణితంలో మెలుకువలు అందించిన గణిత మేధావి రామానుజన్ అని ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్ అన్నారు. రామానుజన్ జయంతి సందర్భంగా శిలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన గణిత నమూనాలను ఎంపిపి పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బివిక, కళ్ళాణి ఆంగ్ల పాఠశాల, ఇద్దివానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రామానుజన్ జయంతి నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో గణిత ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రదర్శించిన గణిత చిత్రాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కడియాల హేమలత, బాబూరావు, పూడి రామారావు, ఉపాధ్యాయులు మురళీ కృష్ణ, రాజుబాబు, మన్మధరావు, హిమకుమార్, ఎం అనిల్, హిమబిందు, బల్లెడ రమేష్, గణిత ఉపాధ్యాయులు బి.మల్లేశ్వరరావు, జానకిరావు, విశ్వనాథ, బి.వెంకటేశ్వరరావు, భగవాన్, బి.తేజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని ఊడికలపాడు మండలపరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి చీపుర్లపాడు సర్పంచ్ ఎన్.అప్పలస్వామి పూలమాలవేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం దైనందిన జీవితంలో గణితం అవశ్యకత, గణితంలో రాణించుటకు మెలకువలు తెలియజేశారు. బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ నెయ్యిల చంద్రరావు ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డబ్బీరు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గణితంపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ ప్రభుత్వ పాఠశాలలో లెక్కలు మాస్టారుగా గతంలో పని చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రాజేశ్వరమ్మ కార్యాలయ సిబ్బంది ఆయను సన్మానించి, మిఠాయి తినిపించారు. అయితే ఎంపీడీవో పణీంద్రకుమార్ ప్రభుత్వ పాఠశాలలో మొదటి లెక్కలు ఉపాధ్యాయులుగా పనిచేసి ఉన్నారు.

జలుమూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధాన ఉపాధ్యాయులు, కెజిబివిలో ప్రిన్సిపాల్ శారద కుమారి రామానుజన్ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు.

పలాస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. అనంతరం గణిత ప్రతిభావంతులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గణిత అధ్యాపకుడు వెంకటమోహన్‌ను సన్మానించారు.

మదర్ థెరిసా విద్యాలయంలో గణిత ఉపాధ్యాయులకు పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని, వజ్జ బాబూరావు ఘనంగా సన్మానం చేశారు. అనంతరం విద్యార్థులకు గణితంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలైన ఆరుగురికి రూ.6వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ గోవిందమ్మ, సిహెచ్.కొత్తూరు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, రవీంద్ర భారతి పాఠశాలలో ప్రిన్సిపాల్ పద్మజ, ఒకేవుడ్ పాఠశాలలో కరస్పాండెంట్ మల్ల మధులత రామానుజన్ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. అమ్మఒడి పాఠశాలలో కరస్పాండెంట్ బి.శ్రీనివాసరావు, ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ నౌపడ సింహాచలం ఘన నివాళ్ళు అర్పించారు. విద్యార్థులతో గణిత ప్రాజెక్టులు తయారు చేయించి ప్రదర్శించారు.

ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో..

టెక్కలి రూరల్: ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్ట్‌లో 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ బహుమతి జె.వి.రోహిత్, ద్వితీయ బహుమతి వి.హారిక, తృతీయ బహుమతి కె.మనీశ్ గెలుపొందారు. కళాశాల డైరెక్టర్.వి. వి. నాగేశ్వరరావు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, హెచ్‌ఒడిలు, డీన్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు, జ్ఞాన భారతి విద్యా సంస్థల కార్యదర్శి జోహార్‌ఖాన్ ఆధ్వర్యాన గణిత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు గణితంపై అవగాహన కల్పించారు. శాంతి నికేతన విద్యా సంస్థల్లో చైర్మన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రోబిన్‌కుమార్ పాడి ఆధ్వర్యాన గణిత దినోత్సవం నిర్వహించారు.



కవిటి : గణిత నమూనాలను పరిశీలిస్తున్న ఎంపిపి పద్మ



పలాస : ఉపాధ్యాయులకు సన్మానం చేస్తున్న భవాని



కోటబొమ్మాళి: ఎంపిడిఒను సన్మానిస్తున్న సిబ్బంది

సోంపేట: కొర్లాయిపేట ప్రాథమిక పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రశాంత్, రాజా, సుభాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: రామకృష్ణాపురం పాఠశాలలో హెచ్ఎం లఖినాన కరుణాకర్ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, బహుమతులను అందించారు. తొలుత రామానుజన్ చిత్రపటానికి పూలమాలేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు డి.అప్పారావు, కె.రామకృష్ణ, పి.సంతోషిణి, ఆర్.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

గోవిందపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో గణితంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాలిన పాపారావు బహుమతులు అందజేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తోడ్పాటు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యవర్గ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో ఇటీవల నిర్వహించిన ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గం కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను గురువారం మర్యాదపూర్వకం కలిశారు. ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావుల ఆధ్వర్యాన కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కలెక్టర్ కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఎక్కడైనా ఉద్యోగులకు సమస్యలు ఎదురైతే సంఘం నాయకులు తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌నూ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బడగల పూర్ణచంద్రరావు, బి.నవీన్, శశిభూషణరావు, రవికుమార్, జి.రత్నకుమార్, కె.రోజాకుమారి, మమతాకుమారి, నారాయణమ్మ, సబినా బేగం పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు చేపట్టాలి

మంత్రి అప్పలరాజును కోరిన ఎన్‌జిఒలు

ప్రజాశక్తి- పలాస

శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివలక్ష్మి ఆత్మహత్యకు ప్రేరేపించిన మున్సిపల్ కమిషనర్ రాజగోపాల్‌పై చర్యలు తీసుకోవాలని మంత్రి సీదిరి అప్పలరాజును ఎన్‌జిఒలు కోరారు. గురువారం ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ అధికారులు సిబ్బందితో పని చేయించుకోవాలే తప్ప, వేధించడం సరికాదన్నారు. మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట శివలక్ష్మి ఘటనకు ఎపి ఎన్‌జిఒ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పలాస ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు బోనెల గోపాలరావు, కార్యదర్శి బి.ఉపేంద్ర, అసోసియేషన్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్, పి.శ్రీనివాసరావు, ఉదయ్‌కుమార్ పాత్రో, కోశాధికారి నీలాపు ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న ఎపి ఎన్‌జిఒ నాయకులు

బాడీబిల్డింగ్‌లో యువకుల సత్తా



విజేతలుగా నిలిచిన బాడీబిల్డర్లు

శ్రీకాకుళం అర్బన్ : విజయనగరం జిల్లా జిఎంఆర్ కళాశాలలో ఈ నెల 20న మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి 25 మంది బాడీ బిల్డర్స్ పాల్గొన్నారు. ఈ పోటీల్లో కె.శేఖర్ మెన్స్ ఫిజిక్‌లో ప్రథమ స్థానం సాధించారు. హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న 999 జిమ్‌కు చెందిన సోమశేఖర్ మాస్టర్ విభాగంలో మూడో స్థానం దక్కించుకున్నారు. ఆర్ట్స్ కాలేజ్ జిమ్‌కు చెందిన అబ్దుల్ ఖాన్ మూడు స్థానం దక్కించుకున్నారు. వైటిహెచ్ జిమ్ గౌరీశంకర్ 65 విభాగంలో ప్రథమ, ఆమదాల వలసకు చెందిన అబ్దుల్‌ఖాన్ మాస్టర్ విభాగంలో ప్రథమ స్థానాలు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సెక్రెటరీ వి.విజయకుమార్, బి.ప్రసాద్, 999 జిమ్ అధినేత ఎస్.శివకుమార్, సీనియర్ బాడీబిల్డర్ గోపాల్, కోచ్ భాస్కర్‌లు విజేతలకు అభినందనలు తెలిపారు.

భూములను సబ్ డివిజన్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

పలాస: తమ సాగులో ఉన్న భూముల్లో రిజర్వు ఫారెస్టు పేరుతో అటవీ అధికారులు పోల్స్ పాటారని, రెవెన్యూ అధికారులు తమ భూములను సబ్ డివిజన్ చేయకపోవడం వల్లే ఈ సమస్య వచ్చిందని, తక్షణమే సబ్ డివిజన్ చేసి, తమను ఆదుకోవాలని రామకృష్ణాపురం రైతులు కోరుతున్నారు. ఈ సందర్భంగా రైతులు సైని దేశయ్య, పందిరి రామారావు, బి.దుర్యోధన గొల్ల మాకన్నపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ సర్వే నెంబరు 148లో ఎన్నో ఏళ్లుగా జీడి సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నమని తెలిపారు. అటవీశాఖ అధికారులు రిజర్వు ఫారెస్టు భూమి అని, తమను ఖాళీ చేయాలని పోల్స్ పాటారని చెప్పారు. వారి చర్యను వ్యతిరేకిస్తూ పోల్స్ తొలగించి, ఈ నెల 17న హైకోర్టు ఆశ్రయించామని తెలిపారు. కోర్టు స్టే ఇచ్చిందని అన్నారు. రెవెన్యూ అధికారులు సబ్ డివిజన్ తమ భూములు తమకు అప్పగిస్తే అటవీశాఖతో తమకు ఇబ్బందులు ఉండవని తెలిపారు. మా జీవనాధారమైన భూములు జోలికి రావద్దని, అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

నగరంలో టిడిపి బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

శ్రీకాకుళం అర్బన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు విజయనగరం జిల్లా రాజాంలో పర్యటిస్తున్న నేపథ్యంలో శ్రీకాకుళం నగరంలో టిడిపి ఆధ్వర్యాన గురువారం ర్యాలీ చేపట్టారు. అరసవల్లిలోని అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడచిన మూడున్నరేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ప్రజలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. ప్రజలకు మేలు చేస్తామని నమ్మబలికి పాదయాత్ర చేపట్టిన జగన్మోహనరెడ్డి ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రజలు ఇదేం ఖర్మ అనే స్థితికి చేర్చి రూ.వేల కోట్లు జెటాక్స్‌ల పేరిట పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు మేలు జరగాలంటే తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. శ్రీకాకుళం నుంచి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ చిలకపాలెం, పొందూరు మీదుగా రాజాం వరకు కొనసాగింది. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాదారపు వెంకటేష్, సింతు సుధాకర్, పి.ఎం.జె.బాబు, చిట్టి నాగభూషణం, ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, ఎస్.వి.రమణ మాదిగ, సురకాశి వెంకటరావు, కవ్వాడి సుశీల పాల్గొన్నారు.



వారణాసి పయనమైన కళాకారులు

వారణాసిలో నాట్య ప్రదర్శనకు కళాకారులు

ఇచ్ఛాపురం: శ్రీ స్వేచ్ఛా నృత్య తరంగణి కూచిపూడి భరతనాట్యం జానపద నాట్య శిక్షణాలయానికి చెందిన కళాకారులకు అరుదైన అవకాశం లభించింది. వారణాసిలో 75 ఆజాదిక అమృత్ మహోత్సవంలో ఇండియా కల్చరల్ ఫెస్టివల్ ఈ నెల 24 నుంచి 2వ తేదీ జనవరి 2023 వరకు వారణాసిలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఆర్గనైజర్ కె.చంద్రశేఖరరావు, మేనేజింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో కళాకారులు పాల్గొననున్నారు. సీనియర్ విభాగంలో కె.కుమార్, బి.భవాని, బి.నయని, టి.ఉషారాణి, ఎంబివి మధురిమ. పి.వర్షిత జి.భార్గవి, పి.సంగీత, జూనియర్ విభాగంలో పి.సత్యశ్రీ, ఎ.కృతజ్ఞ, ఎం.తేజసా, పి.జ్ఞానేశ్వరి నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా వారణిసి వెళ్తున్న కళాకారులకు అకాడమీ నాట్య గురువు మంగి దివ్య, అధ్యక్షులు కె.గోవింద రావు, కోశాధికారి మంగి దానమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

బారువలో గ్రామసభ

సోంపేట: బారువ మేజర్ పంచాయతీలో గురువారం జలజీవన్ మిషన్‌లో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. టీం లీడర్ జె.వెంకట రమణ నీరు, పారిశుధ్య కమిటీల ఏర్పాటు, నిర్వహణ, తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రతి పంచాయతీలోనూ పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.రజిని, వైస్ ఎంపిపి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలపై ఫిర్యాదు చేయాలి



చిరంజీవి

శ్రీకాకుళం లీగల్: బాధిత వినియోగదారులు తమ సమస్యలను కమిషన్‌కు నివేదించుకునేందుకు వీలుందని, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకే హక్కుల రక్షణ చట్టం ఏర్పాటైం దని వినియోగదారుల కమిషన్ జిల్లా అధ్యక్షులు ఆర్.చిరంజీవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఏటా డిసెంబరు 24న నిర్వహిస్తామని, ప్రజలు అవగాహన పెంచుకుని కమిషన్ సేవలను వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. కొత్తగా వినియోగదారుల రక్షణ చట్టాన్ని కేంద్రం- 2020 జూలై 20 నుంచి అమలులోకి తెచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా వినియోగదారులకు సేవలు అందించేందుకు విస్తృత అధికారాలు కమిషన్‌కు కట్టబెట్టారన్నారు. వినియోగదారుల వివాదాల పరిష్కారానికి కమిషన్ చొరవ తీసుకుంటోందన్నారు. జిల్లాలో ఈ పది నెలల వ్యవదిలో 135 కేసులు పరిష్కరించామని అన్నారు. మరో 150 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో అనేక సేవలకు సంబంధించి పరిహారం కోరవచ్చు నని వివరించారు. ఫిర్యాదుదారులు రూ.10 లక్షల లోపు పరిమారం కోసం ఫిర్యాదు చేస్తే... ఎటువంటి కోర్టు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆ పైబడి పరిహారం పొందాల్సిన వారు ఆయా ధరలన బట్టి ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. గరిష్ఠంగా రూ.వెయ్యి వరకు ఫీజు ఉంటుందన్నారు. మారుతున్న వినియోగదారుల సౌకర్యాలను బట్టి చట్టాన్ని వినియోగించుకునేందుకు వీలు కల్పించారని తెలిపారు.

కనీస కూలి రూ.200 ఇవ్వాలి

డ్వామా పీడీ చిట్టిరాజు



మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

పోలాకి: ఉపాధి హామీ కూలీలకు సగటు కూలి రూ.200 పైబడి ఉండాలని డ్వామా పీడీ జివి.చిట్టిరాజు ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదికలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2021-22 సంవత్సరంలో మండలం చేపట్టిన ఉపాధి హామీ పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీల్లో వచ్చిన అభియోగాలను పరిశీలించారు. 31 పంచాయతీల్లో జరిగిన ఉపాది హామీ పనులు, వ్యవసాయ కాలువలు, సిసి రహదారులు, తదితర అంశాలను పరిశీలించారు. కుసుమ పోలవలస పంచాయతీలో 600 మొక్కలు నాటితే కేవలం 30 మొక్కలు మాత్రమే ఉండటాన్ని గుర్తించారు. తక్షణమే పిఎం నుండి రికవరీ చేయాలని ఆదేశించారు. ప్రియాగ్రహారం పంచాయతీలో కోల రామారావు రెండేళ్లుగా తనకు ఉపాధి కూలి అందడం లేదన ఆవేదన వ్యక్తం చేశాడు. చేరాం పంచాయతీలో ఉన్న పలు సమస్యలు పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, ఎపిడి యుగేంధర్, వాటర్ షెడ్ ఎపిడి జయరాం, బి.మురళీకృష్ణ, ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు, బి.శ్రవణకుమార్, షర్మిల శ్రవంతి, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యత మెరుగుకు కృషి

ప్రజాశక్తి- రణస్థలం

గ్రామీణస్థాయి విద్యార్థుల్లోని నైపుణ్యతను మెరుగుపరిచేందుకు పైడిభీమవరం అరబిందో ఫార్మా ఫౌండేషన్ కృషి చేస్తుందని పరిశ్రమ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కార్పొరేట్ హెచ్‌ఆర్ యు.బి.ఎన్.రాజు అన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సుబిలిటీలో భాగంగా బిఎస్‌సి, ఎంఎస్‌సి పూర్తిచేసుకున్న విద్యార్థులకు నాలుగు నెలలుగా శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా గురువారం యోగ్యతా పత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం అత్యాధునిక సామగ్రి, లేబొరేటరీ సదుపాయాలతో కూడిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను మండలంలోని వరిశాంలో స్థాపించామన్నారు. ఎచ్చెర్ల అంబెద్కర్ యూనివర్సిటీ సౌజన్యంతో శిక్షణ, యోగ్యతా పత్రాలు ప్రదానం చేసేవిధంగా తగిన ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. 50 మంది ఎంఎస్‌సి విద్యార్థులకు నాలుగు నెలల పాటు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చామని చెప్పారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్, క్వాలిటీ డాక్టర్ రమాశ్రీనివాస్ ఫార్మా కంపెనీలో క్వాలిటీ డిపార్టుమెంట్ ప్రాముఖ్యత, ఆవశ్యకతను విశదీకరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వి.మనోహర్‌రెడ్డి, కె.కమలాకర్‌రెడ్డి, సుహాస్‌రామ్, మెట్టు శ్రీనివాసన్, పి.తిరుమలరావు, వై.శంకరరావు పాల్గొన్నారు.



పత్రాలను అందజేస్తున్న రాజు



ఇచ్ఛాపురం : ట్యాబ్‌ను అందజేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న బై జూస్ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని విద్యా విధానంలో మంచి ఫలితాలు సాధించాలని జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ అన్నారు. మండలంలోని కేదారిపురంలో ఎంపియుపి పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతికతను ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ సుగుణ, ఎంపిపి బి.పుష్ప, వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, పిట్ట మామయ్య, దక్కత నూకయ్యరెడ్డి, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణీశ్రీ అన్నారు. మండలంలోని తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్ఎం ఎన్.కృష్ణ అధ్యక్షతన ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన ట్యాబ్‌లను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి తమ్మినేని శారద, ఎంపిటిసి తమ్మినేని భారతి, తమ్మినేని శ్రీరామ్మూర్తి, చంద్రశేఖర్, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎంఇఒ దుప్పల రామారావు, సర్పంచ్‌లు ఎన్ని రామచంద్రరావు, సురేష్, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కె.రాఘవాచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న శ్యామ్ మాథ్యూస్

మహిళా స్వయం సాధికారతే లక్ష్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయం సాధికారతే లక్ష్యమని న్యూ లైఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ డైరెక్టర్ కె.శ్యామ్ మాథ్యూస్ అన్నారు. పురపాలక సంఘం పరిధిలోని చింతాడలో న్యూ లైఫ్ హౌస్ ఆఫ్ ప్రేయర్ సంఘ కాపరి పాస్టర్ జి.శామ్యూల్ వరం చర్చి ప్రాంగణంలో ఇటీవల మహిళలు శిక్షణ పొందారు. వీరికి 11 కుట్టుమిషన్లు, ధ్రువపత్రాలను గురువారం పంపిణీ చేశారు. వారిని ఆర్థికంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. న్యూ లైఫ్ టైలరింగ్ సెంటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పాస్టర్ జి.కృపావరం మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోర చిన్నంనాయుడు, పాపారావు, ఉమామహేశ్వరరావు, జె.కె.వెంకటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు. అనంతరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

బాబు బహిరంగసభకు టిడిపి నేతలు

ఇచ్ఛాపురం: రాజాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బహిరంగ సభకు ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అశోక్, కార్యకర్తలు బయలుదేరారు. నాలుగు మండలాలకు చెందిన నాయకులు కొజ్జిరియా కూడలికి చేరుకొన్నారు. భారీ కాన్వాయ్‌గా ఎమ్మెల్యే సమక్షంలో వారంతా బాబు సభకు వెళ్లారు.


శిలాఫకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

రహదారుల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గురువారం చల్లబంద వద్ద ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టును పున: ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళింగపట్నం నుండి పర్లాకిమిడికి మధ్య ఉన్న కల్వర్టు నిర్మాణాలను రూ.45 లక్షలతో పూర్తి చేసామని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, జెడ్పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయిడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, నరసన్నపేట ఎంపిపి ఆరంగి మురళి, ఉప ఎంపిపిలు కలగదండు తాతారావు, కోట అప్పారావు. సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయ్‌కుమార్ సాహు

వాణిజ్య రంగంలో రాణించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వాణిజ్య రంగంలో తగిన జాగ్రత్తలు పాటించకపోతే నష్టపోవాల్సి వస్తుందని, అందువల్ల ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్‌పై అవగాహన కలిగి ఉండాలని విశాఖపట్నానికి చెందిన ఎన్‌ఆర్‌డిసి డాక్టరు విజయ్‌కుమార్ సాహు పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో వాణిజ్య రంగంలో రాణించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు ఆవిష్కరణలు గురువారం అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ కళాశాలలో ఏడాది కాలంలో నిర్వహించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వచ్చే విద్యా సంవత్సరంలో కళాశాల నాక్ గుర్తింపునకు వెళ్తున్న సందర్భంగా ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. కళాశాల విద్యాశాఖ, విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాలు, యాప్‌ల గురించి వివరించారు. సైన్స్ కమ్యూనికేటర్ అపరాధిత మెహర ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్య కో-ఆర్డినేటర్ శాంతీదేవి, కో-ఆర్డినేటర్ హరిత, కన్వీనర్ ప్రదీప్, అధ్యాపకులు పోలినాయుడు, రవిబాబు, చంద్రశేఖర్, నీరజ పాల్గొన్నారు.


సాయిరాజ్‌ను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా సాయిరాజ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త పిరియా సాయిరాజ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా వైసిపి శ్రేణులు నిర్వహించారు. పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వార్డు కౌన్సిలర్‌లు భారీగా స్వాగతం పలికి సాయిరాజ్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చాట్ల సుజాత, డిసిఎంఎస్ చైర్మన్ సెల్లా సుగుణ, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, అభిమానుల సమక్షంలో సాయిరాజ్ కేకు కోశారు. ఈ సందర్భంగా ఆయనకు అభిమానులు సన్మానించారు.


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

కొత్తూరు : సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి 50వ జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యాన మండలంలోని విజయవంతమయ్యాయని మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, ఎఎంసి ప్రతినిధి గోగుల వరప్రసాద్‌రావునాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు సింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ సాధుబాబు తెలిపారు. స్థానిక గోగుల కాంప్లెక్స్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇంతటి విజయానికి సిఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే కారణమన్నారు. పార్టీలకతీతంగా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. విద్య, వైద్యం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సిఎం జన్మదిన వేడుకలు విజయవంతానికి కృషి చేసిన కార్యకర్తలకు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. వీరితో పాటు ఎంపిటిసి వనుమ లక్ష్మీనారాయణ, సర్పంచ్‌ల ప్రతినిధి నాగేంద్ర, జి.ఆనందరావు, ఎల్.తిరుపతిరావు, పంకాజ్ దాస్, రామకృష్ణ, పి.వెంకటరావులు ఉన్నారు.

కల్తీ నూనె వినియోగిస్తే చర్యలు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో కల్తీ నూనెల వినియోగంపై ఆహారభద్రతా విభాగం దృష్టిసారించిందని, ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేస్తున్నామని ఆహార కల్తీ నియంత్రణ జిల్లా అధికారి వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వాహకులు కల్తీ నూనె వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొగలుకక్కే వేడితో, మషాలా ఘుమఘుమలతో ఉన్న ఆహారపదార్థాలను ప్రజలు ఆహారంగా తీసుకుంటున్నారన్నారు. కల్తీ నూనెల వాడకం వల్ల చెడు కొలెస్ట్రాల్ పెరగడంతో జీర్ణకోశ సంబంధిత వ్యాధుల భారినపడతారన్నారు. కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతున్న కల్తీ నూనెల వినియోగంపై దృష్టి సారించినట్టు తెలిపారు.

టెక్కలిని జగన్‌కు కానుకగా ఇద్దాం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాష్ట్రంలో కుప్పంతోపాటు టెక్కలిలో వైసిపి అభ్యర్థిని గెలిపించి సిఎం జగన్మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని వైసిపి నియోజకవర్గ పరిశీలకులు కాయల వెంకటరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షులు కిల్లి కృపారాణి అన్నారు. ఎమ్మెల్యే దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యాన కొత్తపేటలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో మండల స్థాయి వైసిపి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా టెక్కలిలో ప్రజలు ఓట్లు వేస్తే అచ్చెన్నాయుడు గెలవడం లేదని కేవలం ఓటర్లను భయపెట్టి, దౌర్జన్యాలతో గెలుస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ, పంచాయతీ స్థాయిలో కింజరాపు కుటుంబం కబంద హస్తాల నుంచి విముక్తి


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కలిగించారని, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి కంచుకోటను బద్దలు కొట్టాలన్నారు. ఈ విషయంలో తనతో పాటు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అండగా ఉంటామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. కార్యకర్తలంతా ఎటువంటి ఆర్థిక ఇబ్బందులతో పార్టీ కోసం పనిచేయాల్సిన అవసరం లేదని, కేవలం అభిమానంతో ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో కన్వీనర్ల నియామక ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా దౌర్జన్యకాండతో రాజకీయ పబ్బం గడుపుతున్న అచ్చెన్నాయుడుకు చెక్ పెట్టేందుకు పార్టీ కార్యకర్తలంతా సైనికులై సమిష్టిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, ఆర్‌బికె అడ్వైజర్ కమిటీ సభ్యులు కవిటి రామరాజు, దుక్క రోజా రమకృష్ణ, బోయిన నాగేశ్వరరావు, కె.సంజీవరావు, జి.నాగభూషణరావు, జి.కేశవరావు, నూక సత్యరాజు, సుంకరి జనార్ధనరావు, నేతింటి అప్పలస్వామి, బి.సూర్యారావు, గణపతిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం


నగదును అందజేస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌కృష్ణ

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని పలాస ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఆర్.రాజ్యలక్ష్మి అన్నారు. పలాస క్రీడా మైదానంలో సురేష్‌రెడ్డి జ్ఞాపకార్థం గురువారం జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ముందుగా సురేష్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురేష్‌రెడ్డి క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. బాలురు విభాగంలో ఖోఖో విన్నర్ బ్రాహ్మణతర్ల, రన్నర్‌గా పలాస ఉన్నత పాఠశాల, టెన్నీకాయిట్ సీనియర్ విన్నర్ దామోదర టీం, రన్నర్ తారకేశ్వర టీం, జూనియర్ విభాగంలో సిద్ధార్థ టీమ్, విన్నర్‌గా ప్రవీణ్ టీమ్, ఖోఖో విన్నర్‌గా పలాస ఎంజెపి, రన్నర్‌గా పలాస జిహెచ్‌సి, టెన్నీకాయిట్ విన్నర్ కె.సుష్మిత టీమ్, రన్నర్ యు.దీపిక టీమ్‌లు గెలుపు పొందాయి. అనంతరం క్రీడాకారులకు దుస్తులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో పిఇటిల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.తవిటయ్య, మల్లా బద్రయ్య, జె.రామారావు, ప్రిన్సిపాల్ బి.మోహన్‌కృష్ణ, పి.మధు, పి.గజేంద్ర, పద్మంలోచన పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉద్యోగులపై వేధింపులు లేకుండా చూడాలి

ప్రజాశక్తి- పలాస

ఉద్యోగులపై వేధింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ హెల్త్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యప్ప నాయుడు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులపై అధికారుల వేధింపులు లేకుండా పాలకవర్గం చర్యలు తీసుకోవాలని చైర్మన్ బల్ల గిరిబాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న శివలక్ష్మి తన తల్లి ఆరోగ్యం బాగోలేదని కమిషనర్ అందుబాటులో లేకపోతే చైర్మన్‌కు సెలవు చీటి ఇచ్చి వెళ్లారని తెలిపారు. మరలా విధులకొచ్చిన ఆమెకు ఆబ్సెంట్ వేయడంతోమనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు. మహిళా ఉద్యోగులపై ఆయన దుర్భాషలాడుతూ కించపరిచేలా మాట్లాడుతున్నారని, తక్షణమే ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు వినతిపత్రం అందించిన వారిలో ఎం.సత్యనారాయణ, కె.శివరాంప్రసాద్, ఎ.రాంబాబు, రామచంద్రరావు, జెడిబి సత్యనారాయణ, పి.శ్రీనివాస్, నూర్ భాషా ఉన్నారు.

క్షేత్రస్థాయి అధ్యయనం కీలకం

సరుబుజ్జిలి: క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడం ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ విజ్ఞానం సాధ్యమవుతుందని, తద్వారా వారి అభ్యసన విధానంలో మార్పు వస్తుందని షళంత్రి ఇండియన్ బ్యాంకు మేనేజర్ రుంకాన అనిల్‌కుమార్ అన్నారు. సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకౌంటింగ్ అండ్ టేక్సేషన్ విద్యనభ్యసిస్తోన్న విద్యార్థులకు ఆన్ ది జాబ్ శిక్షణలో భాగంగా బ్యాంకు లావాదేవీలపై గురువారం అవగాహన కల్పించారు. వృత్తి విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులకు నెలరోజుల పాటు వివిధ ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిజ్ఞానం పొందేలా డివిఇఒ కోట ప్రకాశరావు ఉత్తర్వులు జారీ చేశారని, తదనుగుణంగా ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు సూచనల మేరకు క్షేత్ర స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దుగ్గివలస రాంప్రసాద్ తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో వస్తోన్న



అవగాహన కల్పిస్తున్న అనిల్‌కుమార్

మార్పులు, డిజిటల్ బ్యాంకింగ్, వివిధ రకాల దరఖాస్తులు నింపడం, డిపాజిట్, డబ్బులు బట్వాడా చేయడం, నెఫ్ట్ ద్వారా నగదు బదిలీ చేయడం వంటి అంశాలపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సందేహాలను అనిల్‌కుమార్ నివృత్తి చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ గౌతమ్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న డిఇఒ పగడాలమ్మ

క్రీడా స్ఫూర్తితో సాగాలి

ప్రజాశక్తి- టెక్కలి

గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని డిఇఒ జి.పగడాలమ్మ అన్నారు. టెక్కలి జూనియర్ కళాశాల మైదానంలో గురువారం టెక్కలి, పాతపట్నం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను క్రీడా జ్యోతి వెలిగించి డిఇఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న అంశాలపై దృష్టి పెట్టాలని కోరారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో సాగాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ దాసరి నాగభూషణం, జోనల్ క్రీడా అధ్యక్షులు బాదాన నారాయణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు జగ్గమ్మ, కెకె.రెడ్డి, తిరుపతిరావు, రాజా రఘునాథరావు, వెంకటరమణ, శ్రీను, క్రీడాకారులు పాల్గొన్నారు.

వయో పరిమితి ఐదేళ్లు పెంచాలి


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

పలాస: పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయోపరిమితిని ఐదేళ్లకు పెంచాలని, ప్రిలిమ్స్ పరీక్ష సమయాన్ని 44 రోజుల నుండి 90 రోజులకు పెంచాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళి డిమాండ్ చేశారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద

ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్

గురువారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 2018 తరువాత పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేశారని, నాలుగేళ్లుగా నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో వేలకు వేలు ఫీజులు కడుతూ కోచింగ్ తీసుకుంటున్న నిరుద్యోగులు నోటిఫికేషన్ కోసం వేచి చూస్తుంటే, వాళ్ల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లిందని, తక్షణమే వయోపరిమితి పెంచి, వారికి అవకాశం కల్పించాలని కోరారు. పోలీసుశాఖలో ఉన్న మొత్తం ఖాళీలకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.నాయకులు శైలు, దేవకి, శ్రావణి, లావణ్య, బుజ్జి, జాను, షణ్ముఖ, వంశి, తిరుపతి, హర్షిత్ పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి- పలాస

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని పలాస మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు వాహన చోదకులకు సూచించారు. కాశీబుగ్గ మేధా పాఠశాలలో గురువారం సాయంత్రం భద్రతా వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు దాటే సమయంలో రెండు వైపులా చూసుకుంటూ వాహనాలు నడపాలన్నారు. వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందితే ఆ కుటుంబమంతా రోడ్డున పడే అవకాశం ఉంటుందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని వాహనం నడపాలని సూచించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ ఎస్‌ఐ శంకరరావు, ఆర్అండ్‌బి శాఖ ఎఇ విక్రం, కరస్పాండెంట్ సోమేశ్వరరావు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఆరోగ్యశ్రీని వినియోగించుకోవాలి

పలాస: వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీని సద్వినియోగించుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ డబ్బిరు భవానీశంకర్ అన్నారు. ఆసుపత్రిలో గురువారం ఆరోగ్యశ్రీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎన్నో రోగాలు నయం చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఏ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు అందుతున్నాయి, రోగాలకు సంబంధించి సంబంధిత వైద్యులు వివరాలను


ఆరోగ్యశ్రీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భవానీశంకర్

ఈ కేంద్రం వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా ఈ కేంద్రం వద్దకు వచ్చి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ చిన్నమనాయుడు, ఆరోగ్యశ్రీ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


సుబ్బారావు పాణిగ్రహి వర్ధంతి వేడుకల్లో మాధవరావు

మతోన్మాదాన్ని ప్రతిఘటించాలి

ప్రజాశక్తి- పలాస

దేశంలో అభివృద్ధి పేరుతో మతోన్మాద పోకడలు ఎక్కువయ్యాయని, దాన్ని ప్రతిఘటించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. మండలంలోని బొడ్డపాడులో విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి 53వ వర్ధంతి సందర్భంగా పాణిగ్రహి సతీమణి సురేఖ పతాకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం సాయుధ గిరిజన రైతాంగ పోరాటం దేశానికే దిక్సూచిగా నిలిచిందని అన్నారు. ఆ ఉద్యమంలో పాణిగ్రహి కత్తిని, కలాన్ని ఏకంచేసి కథన రంగంలో నిలబడ్డారని కొనియాడారు. సభ అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీరాస్వామి, జి.బాలకృష్ణ, పోతనపల్లి కుసుమ, మద్దిల వినోద్, సౌర రామారావు, కోసింటి సోమేశ్వరరావు, సవర బంగ్లాకుమార్, మామిడి భీమారావు, తామాడ సన్యాసిరావు, లిబరేషన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీ

జలుమూరు: మండలంలోని నగిరికటకం సమీపంలోని తామర చెరువు వద్ద గురువారం మహిళ మెడలోని పుస్తెలతాడు చోరీకి గురైంది. పోలీసుల కథనం మేరకు... మర్రివలసకు చెందిన బగ్గు ధనలక్ష్మి వ్యవసాయ పనుల్లో భాగంగా నగిరికటకం తామర చెరువు గట్టు వద్ద రోడ్డుపై ధాన్యం ఎండబెట్టింది. అవి పోగుచేసేందుకు సాయంత్రం మూడు గంటల సమయంలో వెళ్తుండగా ఊద పొలం వద్దకు చేరేసరికి వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని బంగారు పుస్తెలు తాడు తెంపుకొని నగరికటకం వైపు పరారీ అయ్యారు. తులంన్నర బంగారం ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ పారినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

అర్హతే ప్రామాణికం

ప్రజాశక్తి- జి.సిగడాం

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని టి.డి.వలసలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ఆయా పథకాలతో మూడేళ్లుగా కలిగిన లబ్ధిని ప్రజలకు తెలియజేశారు. అనంతరం స్థానికంగా సమస్యలను ప్రజలతోనే అడిగి తెలుసుకున్నారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా సంక్షేమం, అభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో, వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, వైసిపి మండల అధ్యక్షులు బూరాడ వెంకటరమణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్కా వెంకటసాయి, సిగడాం పిఎసిఎస్ చైర్మన్ ఎర్నేని ప్రకాష్, సర్పంచ్ టంకాల రామకృష్ణ పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ ఫణీత్

150 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని వెంకట సాయి క్లినిక్ ఆధ్వర్యాన గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు డాక్టర్ ఫణీత్ రోగులను వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజూ మధ్యాహ్నం పూట స్పెషలిస్ట్ డాక్టర్ అందుబాటులో ఉంటారని అన్నారు. బుధవారం చిన్న పిల్లలు, గురువారం గైనిక్, శుక్రవారం న్యూరో ఫిజీషియన్, శనివారం చెవి ముక్కు సంబంధిత స్పెషలిస్ట్ డాక్టర్లు ఉంటారని పేర్కొన్నారు. అలాగే జనరల్ మెడిసిన్ వైద్యులు ఎం.గోవిందరావు రోజూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇసిజి, ల్యాబ్ సదుపాయం ఉందని, ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో మరిన్ని సేవలను ప్రజలకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి నిర్వాహకులు ఆర్.రమేష్, శైలజ తదితర సిబ్బంది పాల్గొన్నారు.


నిల్వ ఉన్న మురుగునీరు

ఎన్నాళ్లీ మురుగు అవస్థలు

బూర్జ: ప్రభుత్వాలు మారుతున్నా, అధికారులు పరిశీలిస్తున్నా తమ మురుగు అస్తులు మాత్రం తీరడం లేదని చీడివలస గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని చీడివలసలో ఇరువైపులా కాలువలు లేకపోవడంతో మురుగుంతా ప్రధాన రహదారుల పైన ప్రవహిస్తోంది. దీంతో వీధులంతా బురదమై నాచు పడుతుంది. తాగునీటి బోర్ల వద్దా మురుగు చేరడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఎగువన వాడిన మురుగునీరు కిందనున్న నివాస ప్రాంతం చుట్టూ చేరడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. ఈ విషయాన్ని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందన కరువైందని వివరించారు. చేసేదేం లేక గ్రామానికి చెందిన మహిళలు సైడ్ కాలలు తవ్వుకొని మురుగునీరు తరలించేందుకు కృషి చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పార్వతీశంపేట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి వెంకయ్యపేట ఫీడర్ మరమ్మత్తులు, చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. వెంకయ్యపేట, లక్ష్ముడుపేట, జగ్గుశాస్త్రులపేట, భైరిశాస్త్రులపేట, మండాది బ్రిక్స్, పార్వతీశంపేట, రాధాకృష్ణాపురం, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, మునగవలస స్టోన్ ఫ్యాక్టరీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని చెప్పారు. ప్రజలు గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.